ప్రజాశక్తి
మంగళవారం 16, మే 2023
5
అనంతపురం

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

కడప జిల్లా కొండాపురం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించిందని కలెక్టర్ ఎం గౌతమి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిందన్నారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు చెల్లించనున్నామని తెలిపారు. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డవారు సవీరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఉక్కిరి.. బిక్కిరి...

మొన్నటి వరకు వానలు, ఇప్పుడు ఎండలు
మరో రెండు రోజులు వడగాల్పులు

చీరకొంగు కప్పుకుని ద్విచక్రవాహనంలో వెళుతున్న మహిళలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మొన్నటి వరకు వానలు, ఇప్పుడు ఎండలు కలిపి ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఒక రోజు మేఘావృతమై ఉండటం, మరో రోజు ఎండలు, వడగాల్పులు ఉండటంతో జనం అల్లాడిపోతున్నారు. సోమవారం అనంతపురం జిల్లాలో అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శింగనమల మండలం తరిమెల గ్రామంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదయింది. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు ఉండే అవకావముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సగటున ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీలు పెరుగుతుందని సూచించింది. సోమవారం నాటికే గరిష్ట ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరిన నేపథ్యంలో మరింత పెరిగితే 45కు పైగా చేరే అవకాశముంది.

ఈ ఏడాదిలో గరిష్టం 43.1 డిగ్రీలు

ఈ ఏడాది గరిష్టంగా 43.1 డిగ్రీలు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్ 20వ తేదీన ఈ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ తరువాత 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడం సోమవారమే కావడం గమనార్హం. కళ్యాణదుర్గంలో 41.15 డిగ్రీలు, తాడిపత్రిలో 40.79, ఆత్మకూరు మండలంలో 40.78 డిగ్రీలు నమెదయ్యాయి. యల్లనూరు 40.52 డిగ్రీలు నమోదయ్యాయి.

2016లో గరిష్టం

ఏడు సంవత్సరాల్లో అత్యధికంగా ఏప్రిల్ నెలలోనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్ 2016 గరిష్టంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఆ తరువాత 2017 ఏప్రిల్ నెలలో 43.7 డిగ్రీలు నమోదయ్యాయి. 2022 ఏప్రిల్‌లో 43.5 డిగ్రీలు నమోదయింది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏప్రిల్ నెలలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్ నెలాఖరు నుంచి జిల్లాలో వర్షాలు పడటంతో ఇక వాతావరణం చల్లబడిందని అందరూ భావించారు. కాని తిరిగి రెండు, మూడు రోజులుగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఎండలు మండుతున్నాయి. మరోవైపు వడగాల్పులు సైతం పెరుగుతున్నాయి.

ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి

ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం సమయంలో జనం బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. సోమవారం ఉమ్మడి జిల్లాలో ఇద్దరు వడదెబ్బతో మృతిచెందారు. సాయంత్రం వరకు జనం బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. మధ్యాహ్న సమయాల్లో ఏసిలు, కూలర్లను జనం ఆశ్రయించాల్సి వస్తోంది. వడగాల్పులు ఎక్కువ అయ్యే అవకాశమున్న నేపథ్యంలో జనం తగిన జాగ్రత్తలు పాటించాలని వాతావరణ శాఖ సూచిస్తోంది.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల వద్దకు చేరుద్దాం
కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో మండల స్పెషల్ ఆఫీసర్లు, మండల అధికారులతో ప్రభుత్వ పథకాల అమలు, కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా రెవెన్యూ అంశాలు, ఉపాధి హామీ పనులు, గ్రామ, వార్డు సచివాలయాల పనితీరుపై సమీక్ష కొనసాగింది.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

రెవెన్యూ శాఖకు సంబంధించి 12 వేల ఎకరాల పైచిలుకు చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడం అభినందనీయమన్నారు. జాతీయ రహదారులు, పరిశ్రమల ఏర్పాటు, 90 రోజుల్లో ఇళ్ల పట్టాల పంపిణీ వంటి కార్యక్రమాల కోసం భూసేకరణ కార్యక్రమం వేగవంతం చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఎంఐజీ లేఅవుట్లకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపించాలన్నారు.

జిల్లా విభజన తర్వాత జిల్లాలో పరిశ్రమల అవసరం పెరిగిందని, పారిశ్రామిక అభివృద్ధి కోసం ఏపీఐఐసీకి తగినంత స్థలం అందించాలని అన్నారు. ఇప్పటికే ఆమోదించిన జగనన్న హౌసింగ్ లే అవుట్లలో నూతన లబ్ధిదారులకు ఇళ్ల పట్టా ఇచ్చే కార్యక్రమం చేపట్టాలన్నారు. నీటి ప్రాజెక్టుల కోసం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పనులు సమస్యలు లేకుండా పూర్తి చేయాలన్నారు. న్యాయ సమస్యలు ఎదురైనప్పుడు త్వరితగతిన కౌంటర్లు వేస్తూ కేసులు కొలిక్కి వచ్చేలా చూడాలన్నారు. రీ సర్వే త్వరిత గతిన పూర్తి చేసి సర్వే రాళ్లు పాతాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ శాతం మెరుగు పరచాలన్నారు. ఎస్డీజీ సర్వే యాప్ అప్డేట్లపై సిబ్బందికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. మహిళా సాధికార కార్యక్రమాలు బాల్య వివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీలు వంటి సామాజిక దురాచారాలపై చైతన్యం కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, డీఆర్వో గాయత్రీ దేవి, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, సీపీవో ప్రేమ్‌చంద్, డీఈవో సాయిరాం, పంచాయతీ రాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి

మొదటి రోజు ఈఏపీసెట్ ప్రశాంతం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ, ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈఏపీసెట్-23 సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం,సాయంత్రం రెండు పూటలు జరిగిన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 50, 235 మంది హాజరు కావల్సి ఉండగా 3231 మంది గైర్హాజరైనల్లు ఈఏపీసెట్-23 ఛైర్మెన్ ఆచార్య జి. రంగ జనార్ధన, కన్వీనర్ ఆచార్య సి. శోభాబిందు తెలిపారు. సోమవారం ఉదయం మరియు మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో ఆంధ్రప్రదేశ్ లో మొత్తం 48,913 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా 46,380 మంది హాజరయ్యారని చెప్పారు. అలాగే తెలంగాణలో 4,322 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా 3,624 మంది హాజరయ్యారని చెప్పారు. ఈ పరీక్షలకు 93.93 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఈఏపీసెట్ -23 ఛైర్మెన్ ఆచార్య జి. రంగ జనార్ధన తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ : సోమవారం ప్రారంభమైన ఈఏపీసెట్ -23 పరీక్షల కేంద్రాలను జేఎన్టీయూ ఉపకులపతి, ఈఏపీసెట్ ఛైర్మెన్ ఆచార్య జి.రంగ జనార్ధన పరిశీలించారు. అనంతపురం లోని అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలను, కడప జిల్లాలోని కె.ఎస్.ఆర్.ఎం ఇంజనీరింగ్, కోరం ఇంజినీరింగ్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పరీక్షలు నిర్వహణలో నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

రోడ్డు ప్రమాద దృశ్యం

ఏడుగురు దుర్మరణం, మృతుల్లో జిల్లా వాసులు
ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి

ఎంతో సంతోషంగా దైవదర్శనానికి వెళ్లిన ఓ కుటుంబం మరో అరగంటలో ఇంటికి చేరుకుంటామనుకున్న సమయంలో ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. తుఫాను వాహనాన్ని లారీ ఢీకొన్న ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందారు. వీరిలో ఆరుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు. మృతుల కుటుంబసభ్యులు ఆసుపత్రి ఆవరణంలో చేస్తున్న రోదనలు కంటతడిపెట్టించాయి.

ప్రజాశక్తి తాడిపత్రి

కడప జిల్లా రైల్వే కొండాపురం సమీపంలోని తాడిపత్రి కడప జాతీయ రహదారిలో తాడిపత్రి శివార్లలోని చిత్రావతి నది సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతిచెందారు. అందులో ఒకే కుటుంబానికి చెందినవారు ఆరుగురు కాగా, మరొకరు వాహనం డ్రైవర్. ఈ ప్రమాదానికి సంబందించిన వివరాలు... తాడిపత్రి పట్టణంలోని కృష్ణాపురంలో నివాసముంటున్న వెంకటలక్ష్మి తన ముగ్గురు చెల్లెళ్ల కుటుంబంతో కలిసి తిరుమలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం తాడిపత్రిలో తుఫాను వాహనాన్ని బాడుగ తీసుకుని డ్రైవర్‌తో కలసి మొత్తం 14 మంది తిరుమలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సోమవారం తెల్లవారుజామున తాడిపత్రి శివార్లలోని కడప జిల్లా రైల్వే కొండాపురం సమీపంలోని తాడిపత్రి కడప జాతీయ రహదారిలో చిత్రావతి నది సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో తాడిపత్రికి చెందిన వెంకటలక్ష్మి (55), ఆమె కుమారుడు సునిల్‌కుమార్‌రెడ్డి (27), కర్నాటరాష్ట్రం కంప్లికి చెందిన లక్ష్మిదేవి (38), కంప్లికి చెందిన సుభద్ర (38) ఆమె కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డి(11), మైలవరానికి చెందిన సుమలత(38), వాహనం డ్రైవర్ అబకంపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డి (38) మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మేఘన, శిల్ప పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో వెంకటలక్ష్మి, లక్ష్మిదేవి, సుభద్ర, సుమలత సొంత అక్కాచెల్లెళ్లు కాగా, సునిల్‌కుమార్‌రెడ్డి, నితిన్ వెంకటలక్ష్మి, సుభద్ర కుమారులు. ఈ ప్రమాదంలో గాయపడిన నారాయణరెడ్డి, జయలక్ష్మి, ఆదిలక్ష్మి, మోక్షిత్‌రెడ్డి, యువన్‌రెడ్డి, మేఘనారెడ్డి, శిల్పారెడ్డిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి చెందడంతో ప్రభుత్వ వైద్యశాల వద్ద కుటుంబ సభ్యులు చేస్తున్న రోదనలు కంటతడి పెట్టించాయి.

అరగంటలో ఇంటికి చేరుతామనే లోపే ...

దైవ దర్శనానంతరం ఎంతో సంతోషంగా మరో అరగంటలోపు ఇంటికి చేరుకుంటామని అనుకునే లోపే వారు అనంతలోకాలకు వెళ్లారు. తాడిపత్రికి చెందిన వెంకటలక్ష్మి భర్త సంవత్సరం క్రితం మృతిచెందాడు. అప్పటినుంచి ఇంటి వద్దనే ఉన్న వెంకటలక్ష్మిని ఆలయాల దర్శనార్థం తీసుకువెళదామని కుటుంబసభ్యులు భావించారు. ఈ నేపథ్యంలో వెంకటలక్ష్మి తన చెల్లెళ్లు అయిన లక్ష్మిదేవి, సుభద్ర, సుమలతను తాడిపత్రికి పిలిపించుకున్నారు. వీరితో పాటు వెంకటలక్ష్మి కుమారుడు సునిల్‌కుమార్‌రెడ్డి, నితిన్‌తో పాటు వారి బంధువులైన మేఘన, శిల్ప, ఆదిలక్ష్మి, నరసింహారెడ్డి, కాటసాని భాస్కర్ రెడ్డి, తదితరులతో పాటు వాహన డ్రైవర్ సుధాకర్‌రెడ్డి మొత్తం 14 మంది తుఫాను వాహనంలో తిరుమలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈ విషాదఘటన చోటు చేసుకుంది.

రోడ్డు ప్రమాదంలో తునాతునకలు అయిన తుఫాను వాహనం, చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు

స్పందనలో అధికారులతో మాట్లాడుతున్న నాయకులు, కార్మికులు

బకాయి వేతనాలకై పారిశుధ్య కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం భిక్షాటన చేపట్టారు. నెలనెలా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు వాపోయారు. ఇంటి అద్దె చెల్లించకపోవడంతో సామాన్లు బయట వేసి ఖాళీ చేయమని గృహ యజమానులు ఒత్తిడి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ కార్మికులు రిటైర్డ్‌కాగా 108 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంబంధించి బకాయి ఉన్న యూనిఫారాలు కొబ్బరి నూనె సబ్బులు చెప్పులు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఈసందర్భంగా కార్మికులు, నాయకులు స్పందన కార్యక్రమంలో అధికారులను నిలదీయడంతో మూడు రోజుల గడువు ఇస్తే వారికి వేతనాలు వచ్చేలా ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. దీంతో వారు భిక్షాటన విరమించారు. పాలకులు, అధికారులు స్పందించి తమ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కార్యదర్శి సాకే తిరుమలేశ, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, నల్లప్ప, లక్ష్మీనారాయణ, కురుపమ్మ, మంజుల జ్యోతి, రాఘవేంద్ర ప్రసాద్, ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా శాఖ పిఎస్ ప్రవీణ్‌ప్రకాష్‌ను కలిసిన మోహన్‌రెడ్డి

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌ను వైసిపి రాష్ట్ర కార్యదర్శి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి సోమవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రవీణ్ ప్రకాష్‌కు బొకే అందజేస్తున్న ఎల్ఎం.మోహన్‌రెడ్డి

సఫాయి కర్మచారులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సఫాయి కర్మాచారులకు ఉపాధి కల్పించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సఫాయి కర్మాచారులకు ఉపాధి కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సఫాయి కర్మాచారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెన్నోబులేసు, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చెన్నోళ్ల తిరుపాలు మాట్లాడుతూ సఫాయి కర్మాచారులకు జిఓ 30 ప్రకారం గతంలో పని చేసిన పారిశుధ్య కుటుంబాల సభ్యులకు స్థానిక మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ఉపాధి కల్పించాలని కోరారు. అనంతరం స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ ఎమ్.గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో , ఎస్సీ ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప, ఎమ్మార్పీఎస్ నాయకుడు మందల పకీరప్ప, తరుణ్, ఓబులమ్మ, రాజలక్ష్మి, రుక్మిణి, నాగలక్ష్మి, ఇందిరా, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
జెఎన్‌టియు ప్రిన్సిపల్ పి.సుజాత

ప్రజాశక్తి-అనంతపురం

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పి.సుజాత పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ విభాగం సెమినార్ హాలులో 'పర్యావరణహిత జీవనశైలి' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు. అలాగే నీటిని వృథా చేయరాదని, విద్యుత్ వాడకాన్ని తగ్గించాలిన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవాని, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ దీప, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.విష్ణువర్ధన్,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీని మళ్లీ పడగొట్టిన ఆకతాయిలు
పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలల పాఠశాల క్రీడామైదానంలో నూతనంగా నిర్మించిన ప్రహరీని ఆకతాయిలు మరోసారి కూల్చివేశారు. గతంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీ పడిపోయి క్రీడా మైదానం చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉండేది. దీంతోపాటు కుక్కలు, పందుల సంచారంతో అధ్వానంగా మారింది. అయితే ఇటీవల సిఎం జగన్ పర్యటన సందర్భంగా పాఠశాల క్రీడామైదానంలో హెలిపాడ్ ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో క్రీడా మైదానాన్ని పరిశుభ్రం చేయడంతోపాటు కూలిన ప్రహరీని పునర్‌నిర్మించారు. అయితే ప్రహరీనికి నిర్మించి పది రోజులు కూడా గడవకనే కూల్చడం విశేషం. సోమవారం ఉదయం వాకింగ్‌కు వచ్చిన వాకర్లు, క్రీడాకారులు గమణించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన హెడ్‌కానిస్టేబుల్ చలపతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు వివేకానందరెడ్డి, వాకర్ల సహకారంతో అప్పటికప్పుడు పడిపోయిన ప్రహరీని పునర్‌నిర్మించారు

ఫ్యాక్షన్ లేకుండా చేయడమే 'యాత్ర' లక్ష్యం : ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

గ్రామాల్లో ఫ్యాక్షన్ లేకుండా చేయడమే ప్రజా సంక్షేమ యాత్ర లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకటరెడ్డిపల్లి గ్రామంలో మూడో విడత ప్రజా సంక్షేమ యాత్రను ప్రారంభించారు. వెంకటరెడ్డిపల్లి నుంచి గదరగుట్టపల్లి, తెల్లమిట్టపల్లి, భోగసముద్రం మీదుగా అయ్యవారిపల్లి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నాయకులు ప్రజలను అమాయకులను చేసి తప్పుడు సందేశాలతో మభ్యపెడుతూ ఫ్యాక్షన్ రెచ్చగొడుతూ ఇష్టానుసారంగా పాలన చేశారన్నారు. తాను ఎమ్మెల్యే అయినప్పటి నుంచి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తమపై అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు. తనపై 73 కేసులు పెట్టారని తప్పుడు ఆరోపణ చేస్తున్న జెసి ప్రభాకర్‌రెడ్డి కేసులు పెట్టినట్లు నిరూపిస్తే తాడిపత్రి వదిలి వెళ్తానన్నారు. నిరూపించకపోతే మీరు తాడిపత్రిని వదిలిపోతారా.. అని సవాల్ విసిరారు. మళ్లీ అధికారంలోకి రానున్నది వైసిపీనే అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రమణమ్మ, ఎంపిపి సరస్వతి, వెంకటరెడ్డిపల్లి వైసిపి నాయకులు పుల్లారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మునిరెడ్డి, ఆలూరు రామేశ్వర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్లకు వినతిపత్రాలు

బుక్కరాయసముద్రంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందజేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. అధిక వర్షాలు, భారీ గాలులు, వడగండ్ల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో తహశీల్దార్ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటలు నష్టపోయిన రైతులందరికీ పంటల ఆధారంగా ఎకరాకు కనీసం రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మార్చి నెలలో వీచిన భారీ గాలులు, వడగండ్ల వానల వల్ల వేల హెక్టార్లలో అరటి, మొక్కజొన్న, టమోటా, బత్తాయి, దానిమ్మ, బొప్పాయి, కరివేపాకు వంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో రైతులు సర్వస్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారంతోపాటు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కౌలురైతులను కూడా ఆదుకోవాలన్నారు. ఇకపోతే జిల్లాలో ఐదారు నెలలుగా రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. నెలకు సగటున ఏడుగురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం రైతు ఆత్మహత్యలను నమోదు చేయడంలో, పరిహారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే ఆయా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, లేనిపక్షంలో లేనిపక్షంలో ఆందోళనలు ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, జి.రమేష్, డి.నాగార్జున, డి.కుమార్,పెద్ద కుళ్లాయప్ప, బి.కుళ్లాయప్ప, అర్.మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శివశంకర మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వడగండ్ల వానతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కావున వెంటనే ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సర్వే చేసి నష్టపోయిన రైతులందరికీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎం.రామయ్య, లింగన్న, రైతుసంఘం రాము, జయలక్ష్మి, పరమేష్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : వర్షాలకు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు నష్టపోయిన రైతులకు కనీసం ఎకరాకు 30.వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సూర్యప్రకాష్, ముత్యాలు, ఎదునందన, నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పంట నష్టపోయిన రైతులకు పంటల ఆధారంగా ఎకరాకు కనీసం రూ.30.వేల నష్టపరహారం చెల్లించాలని, రైతు ఆత్మహత్యల నమోదు నిబంధనలను సవరించి, పరిహారాన్ని పెంచాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో వీచిన భారీ గాలులు, వడగండ్ల వానలకు వేల హెక్టార్లలో అరటి, మొక్కజొన్న, టమోటా బత్తాయి, దానిమ్మ, బొప్పాయి, కరివేపాకు తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మేలో మరోసారి కురిసిన వర్షాల వల్ల చేతికి వచ్చిన పంటలు పూర్తిగా నష్టపోయాయని తెలిపారు. కావున వెంటనే పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ మారుతికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, చేనేత కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు మధు, భవన నిర్మాణ సంఘం పట్టణ అధ్యక్షులు తిమ్మరాజు, నాయకులు తిప్పేస్వామి, హరున్, కుమార్, రామంజి, సుభాన్, మహేష్, అంజి, బొమ్మన్న, నాగేంద్ర, నాగేంద్రనాయక్, పి.నాగరాజు, ఓబులేసు, నాగరాజు, కేశవ, అంజి, నాగ, శ్రీరాములు, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ఆత్మకూరులో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

డి.హీరేహాల్ : పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం, ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున పంటలు నష్టపోయిన రైతులందరికీ పంటల ఆధారంగా ఎకరాకు రూ.30వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు లోకేష్, రైతులు పాల్గొన్నారు.

ఉరవకొండ : వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి పంటల ఆధారంగా ఎకరాకు కనీసం రూ.30వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ముందస్తు గుత్తలు చెల్లించి సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన రైతులతోపాటు ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఉరవకొండ అగ్రికల్చర్ ఎడి పద్మజాకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు మురళి, వీరాంజనేయులు, వెంకటేశులు, సిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు పరిహారం అందజేయాలన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు రంగనాథ, నాగరాజు, అశోక్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మదనపల్లెలో ప్రేమజంట ఆత్మహత్య

మృతులు కూడేరు వాసులు

మృతిచెందిన వెంకటనాయుడు, వినీష (పాతచిత్రాలు)

అనంతపురం : మదనపల్లి రూరల్ మండలం అబ్బగొంది అడవిలో అనంతపురం జిల్లాకు చెందిన ప్రేమజంట ఆత్మహత్య చేసుకుంది. రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు... అనంతపురం జిల్లా కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామానికి చెందిన బోయ రమణ కుమార్తె వినీషా (18), అదే గ్రామానికి చెందిన ధనంజయ కుమారుడు ముత్తులూరు వెంకటనాయుడు (28) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే వీరి పెళ్లికి పెద్దలు నిరాకరించారు. దీంతో ఎలాగైనా పెళ్లి చేసుకోవాలని భావించి ఈనెల 9న రాత్రి ఇంటి నుంచి పారిపోయి వచ్చారు. ఈనేపథ్యంలో ఈనెల 14న మదనపల్లి అబ్బగొంది అడవిలో చున్నీతో ఇద్దరూ ఆత్మహత్య చేసుకోవడం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఈమేరకు దర్యాప్తు చేపట్టగా మృతులు అనంతపురం జిల్లా కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన వారిగా తెలిసిందన్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

గుత్తి : కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పి.కొత్తూరు గ్రామానికి చెందిన దంపతులు సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన భార్యాభర్తలు శివరాజ్, సునీత కుటుంబ సమస్యలతో మనస్థాపానికి గురై పురుగుమందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నారు. గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చోరీకి విఫలయత్నం

వెంబడించి దొంగను పట్టుకున్న స్థానికులు

గుత్తి : బ్యాంకులో నగదును డ్రా చేసుకుని వెళ్తున్న మహిళా పొదుపు సంఘం సభ్యురాలి నుంచి నగదును ఓ దుండగుడు చోరీ చేశాడు. గమనించిన స్థానిక యువకులు వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన గుత్తి ఆర్ఎస్‌లో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఊటకల్లు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి తన భర్త లక్ష్మన్నతో కలిసి గుత్తి ఆర్ఎస్‌లోని యూనియన్ బ్యాంకుకు వచ్చింది. మహిళా సంఘానికి సంబంధించిన రూ.1.80 లక్షలు నగదును డ్రా చేసుకుని ద్విచక్ర వాహనంలోని బ్యాగులో పెట్టారు. గమణించిన ఓ దుండగుడు నగదు బ్యాగును దొంగలించి పరారయ్యాడు. గమనించిన స్థానిక యువకులు వెంబడించి దుండగున్ని పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి దుండగున్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడు ముంబయికి చెందిన ప్రభుగా పోలీసులు గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'శ్రీచైతన్య'లో ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం

మాట్లాడుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి

స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని బాలాజీ కళ్యాణ మండపంలో సోమవారం శ్రీచైతన్య ఉపాధ్యాయుల వార్షిక శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం జోన్ శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏషియాలోనే అతిపెద్ద విద్యా సంస్థ శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులకు ఇలాంటి వార్షిక శిక్షణ సదస్సులు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇలాంటి శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆల్ ఇండియా అకడమిక్ కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ అనంతపురం, కర్నూలు జోన్లకు చెందిన ఉపాధ్యాయులు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకుని, తమ మేధస్సుకు పదును పెట్టాలన్నారు. ఈకార్యక్రమంలో స్టేట్ అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ఉమ్మడి అనంతపురం జిల్లాల కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాస్, ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్లు నాగేశ్వరావు, గోవిందు, స్టేట్ సి బ్యాచ్ కోఆర్డినేటర్లు నరేంద్ర, కేశవ్, 886 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి ఫ్రీజర్‌ను అందజేస్తున్న దృశ్యం

ఫ్రీజర్ బాక్స్ వితరణ

గుత్తి : ప్రభుత్వ ఆసుపత్రికి సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫ్రీజర్ బాక్స్ విరాళంగా ఇచ్చారు. లయన్స్ క్లబ్ సభ్యుడు, దాత టి.శ్రీనివాసులు యాదవ్ అలియాస్ 108 శీనా ఫ్రీజర్ బాక్స్‌ను ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ యల్లప్పకు అందజేశారయా కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి విరుపాక్షరెడ్డి, రామచంద్ర, ప్రకాష్‌రావు, కామేశ్వరరావు, చైతన్య, మగ్బూల్ హుస్సేన్, జిలాన్, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్పందన గ్రీవెన్స్‌సెల్ వచ్చిన అర్జీలపై అధికారులు సత్వరమే స్పందించి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎమ్.గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఒ గాయత్రిదేవి, హౌసింగ్ పీడీ కేశవనాయుడు తదితరులతో కలెక్టర్ గౌతమి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 283 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలకు నిర్ణీత సమయంలోగా ఫిర్యాదు దారులు సంతృప్తికరం చెందేలా సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత విద్య సక్రమంగా అమలు జరగడం లేదని ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి ఫిర్యాదు చేశారు. కార్పొరేట్ విద్య పేద పిల్లలకు అందని ద్రాక్ష మారిందని, ప్రతి ప్రయివేటు కార్పొరేట్ పాఠశాలలు 25 శాతం ఉచిత విద్య ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వడం లేదన్నారు. తక్షణమే పేద పిల్లలకు ఉచిత విద్య అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గుంతకల్ మండలానికి రెగ్యులర్ తహశీల్దార్‌ని నియమించాలని తిమ్మాపురం నివాసి టిసి.నారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి తహశీల్దార్‌గా డిప్యూటీ తహశీల్దార్‌ని నియమించారని ఆ అధికారి ప్రభుత్వ పరంపోగు భూములను ఇష్టారాజ్యాంగా పట్టాలు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఆస్తులను లూటీ చేయిస్తున్నాడని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి రెగ్యులర్ తహశీల్దార్ నియమించాలని, ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు.

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తగదు : మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం చేయవద్దని మేయర్ మొహమ్మద్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అకౌంట్స్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. సిబ్బంది మధ్య సమన్వయ లోపంతో సకాలంలో బిల్లుల ప్రక్రియ ముందుకు వెళ్లడం లేదని, ఇకపై ఎప్పటికప్పుడు పెండింగ్ లో లేకుండా బిల్లుల ప్రాసెస్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అకౌంట్ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి

ఉరవకొండ : ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పెద్ద కౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఫ్యామిలీ డాక్టర్ పివి.అనికేత్, డాక్టర్ చందన సూచించారు. సోమవారం కౌకుంట్ల పిహెచ్‌సి పరిధిలోని రేణుమాకులపల్లి గ్రామంలో సర్పంచి బి.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల గ్రామ ప్రజలకు కలిగే ప్రయోజనాలు వైద్యులు వివరించారు. మేఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉప్పు, కారం తగ్గించిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. అనంతరం లింగ వివక్షపై అవగాహన కల్పించారు. సమాజంలో స్త్రీ పురుషులు సమానమన్నారు. తల్లిదండ్రులు అపోహలు, మూఢనమ్మకాలను వదిలి కొడుకు, కూతుళ్లను సమానంగా పెంచాలని సూచించారు. ముఖ్యంగా భ్రూణ హత్యలకు పాల్పడరాదన్నారు. పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్ చౌడప్ప, నాగరత్నమ్మ, ఆరోగ్య సహాయకుడు ఎం.ప్రసాదరావు, ఎఎన్ఎం నాగమ్మ, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం : రాయలసీమ బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో 550కి పైగా మార్కులు సాధించిన బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు సంఘం అధ్యక్షులు పాములరాయి వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, కులం, మార్కుల జాబితా, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో రాయలసీమ బలిజ మహా సంఘం కార్యాలయంలో అందజేయాలన్నారు.

వైభవంగా రుక్మిణీ పాండురంగ రథోత్సవం

బొమ్మనహాల్ : మండలంలోని ఉంతకల్లు గ్రామాలో వెలసిన రుక్మిణీ పాండురంగ స్వామి రథోత్సవాన్ని పాండురంగ పీఠాధిపతి గోపాల్ మహారాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించి పట్టువస్త్రాలు ధరింపజేశారు. తర్వాత 30 అడుగుల రథంపై స్వామి మూలవిరాట్‌ను ఆసీనులు చేసి గ్రామ పురవీధుల గుండా బాజాభజంత్రీల నడుమ ఊరేగించారు. ఉత్సవానికి విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మెట్టు గోవిందరెడ్డివారితోపాటు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు హాజరై పూజలు నిర్వహించారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని వినతి

ఉరవకొండ : పట్టణంలోని 15వ వార్డు పరిధిలో ఉన్న శివరామిరెడ్డి కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని వార్డు సభ్యులు వశీకేరి మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో విద్యుత్ ఎఇ గురుమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ శివరామిరెడ్డి కాలనీలోని అనేక వీధుల్లో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో కట్టెలను పాతి విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారన్నారు. దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రానున్నది వర్షాకాలం కావడంతో విద్యుత్ తీగలు కిందపడే అవకాశం ఉందని, ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఎఇ స్పందిస్తూ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించొద్దు

బొమ్మనహాల్ : మండలంలోని ప్రభుత్వ అనుమతి లేకుండా ఎలాంటి గృహాలు నిర్మించొద్దని పంచాయతీ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఇప్పటికై ఇళ్లు నిర్మించుకున్న వారు ప్రభుత్వానికి శిస్తు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా గృహాలు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉచిత ఖత్నాకు విశేష స్పందన

ప్రజాశక్తి-రాయదుర్గం

ఖత్నా చేయించుకున్న వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం తరపున పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న జామియా అన్వారుల్ ఉలూమ్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత ఖత్నా (వడుగుల) కార్యక్రమానికి విశేష స్పందన లభించిది. ఇందులో భాగంగా 140 మంది పిల్లలు ఖత్నా చేయించుకున్నారు. ఖత్నా చేయించుకున్న పిల్లలకు 11 రకాల నిత్యావసర సరుకులతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ షర్మస్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజుమాన్ కమిటీ ఉపాధ్యక్షుడు బాషా, కార్యదర్శి లడ్డు మొహమ్మద్ షఫీ, సహాయ కార్యదర్శి హుజేఫా, కోశాధికారి అహ్మద్ హుస్సేన్, కమిటీ సభ్యులు బాషా, ఖాసీం, ఉమ్రాలీ, రజాక్, జాకిర్, షాకిర్, పట్టణంలోని మస్జిద్ ముతవల్లిలు, ప్రభుత్వ ఖాజీ మొహమ్మద్ సైపుల్లా, హమీద్, మున్సిపల్ వార్డు సభ్యులు ఫకృద్దీన్, న్యాయవాది వహాబ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దివాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని జడ్పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, మండలంలోని అన్నిశాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలన్నారు. అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో రావాలన్నారు.

పురపాలక సంఘ కార్యాలయము
తాడిపత్రి

బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి.నెం.31/2016/ఏ1 — తేది:15-05-2023

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా 2023-2024 సం॥నకు (01-06-2023 తేది నుండి 31-03-2024 వరకు) ఈ క్రింద ఉదహరించిన గుత్తలను మరియు ఫీజులను వసూలు చేయు హక్కులు తాడిపత్రి పురపాలక సంఘ కార్యాలయములో తేది:22-05-2023(సోమవారము) ఉ॥ 11గం॥లకు కమిషనరు వారిచే గాని లేక వారి వలన అధికారము పొందిన వారిచే గాని బహిరంగముగా వేలము వేయబడును. వేలములను ఆమోదించుటకు లేదా తిరస్కరించుటకు కమిషనర్ వారికి పూర్తి అధికారము కలదు.

సదరు వేలములు సవరించిన 1965 సం॥ ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీల చట్టము అనుసరించి చేయబడినట్టియు మరియు చేయబడినట్టి ప్రభుత్వ ఉత్తరువుల, బైలాలు అనుసరించి వేలము ముందు ఇతరములై ఏ విధమైన కౌన్సిల్ వారి షరతులు ఉదహరించిన సాధారణ మరియు ప్రత్యేక షరతులకు లోబడవలయును.

వ నెం.	వివరములు	వేలము నందు పాల్గొను వారు చెల్లించవలసిన ధరావత్తు డి.డి./రొక్కముగా రూ.	ఇవ్వవలసిన మోతుబరి సర్టిఫికేట్ విలువ రూ.	గుత్తకాల వ్యవధి
1	2	3	4	5
1	శ్రీమతి జె.సి. నాగ లక్ష్మమ్మ దినకూరగాయల మార్కెట్ నందు ఫీజు వసూలు చేసుకొను హక్కు	25,00,000/-	35,00,000/-	01-06-2023 నుండి 31-03-2024 వరకు
2	రోడ్డు మార్జినులో రోడ్డుమీద వాహనముల మీద అనగా లారీలు, ట్రాక్టర్లు, మినీ లారీ, మరియు ఆటోల పై దిగుమతి సరుకుల మీద మరియు అమ్ముకొను వస్తువుల మీద వసూలు చేసుకొను హక్కు	10,00,000/-	15,00,000/-	01-06-2023 నుండి 31-03-2024 వరకు
3	శనివారపు మార్కెట్ మరియు సంత మార్కెట్ ఆవరణలో మరియు పట్టణములోని అన్ని ప్రాంతములలో అమ్ముకొను జీవాలపై గేటు వసూలు చేసుకొను హక్కు	4,00,000/-	5,00,000/-	01-06-2023 నుండి 31-03-2024 వరకు
4	దిన కూరగాయల మార్కెట్ ముందర భాగము నందు గల ఖాళీ స్థలములో సైకిల్ స్టాండ్ నందు ఫీజు వసూలు చేసుకొను హక్కు	2,50,000/-	3,00,000/-	01-06-2023 నుండి 31-03-2024 వరకు

కావున ఆసక్తిగల వారు లీజు షరతులు మరియు ఇతర వివరములకు పురపాలక సంఘ కార్యాలయ పనివేళలయందు సంప్రదించగలరు.

సం/- బి.శేషన్న, కమిషనరు, తాడిపత్రి పురపాలక సంఘం.

భవిష్యత్తుకు భరోసా లోకేష్ పాదయాత్ర

సంఘీభావ యాత్రల్లో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం/గుమ్మఘట్ట

పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ, భవిష్యత్తుపై ప్రజలకు భరోసానిస్తూ సాగుతున్న టిడిపి యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర సమకాలీన రాజకీయాల్లో సరికొత్త ప్రభంజనాన్ని సృష్టిస్తోందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు అన్నారు. యువగళం పాదయాత్ర వంద రోజులు చేరుకున్న సందర్భంగా గుమ్మఘట్ట మండలంలోని 75-వీరాపురం నుంచి రాయదుర్గం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వరకూ సాగింది. అక్కడే ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్న లోకేష్ ఎర్రటి ఎండలో సామాన్యుల పక్షాన రాష్ట్ర భవిష్యత్తు కోసం వేలాది కిలోమీటర్లు పాదయాత్ర చేస్తుండడం అత్యంత సాహసోపేతమన్నారు. పాదయాత్రలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలను సాక్ష్యాధారాలతో లోకేశ్ బయట పెడుతుండటంతో వైసిపి నాయకులకు నిద్రపట్టడం లేదన్నారు. ఈ రాష్ట్రానికి చంద్రబాబు పాలన మళ్లీ రావాలని, రాష్ట్ర భవిష్యత్తు బాగుపడాలని యువత సమరోత్సాహంతో కదం తొక్కుతోందన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అవినీతి, అక్రమాలు తారాస్థాయికి చేరాయని విమర్శించారు. కాపు విచ్చలవిడిగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్ పూల నాగరాజు, మండల కన్వీనర్లు గిరిమల్లప్ప, పట్టణ అధ్యక్షుడు నాగరాజ్, హనుమంతు, హనుమంతురెడ్డి, బలరామిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి సన్నన్న, సర్పంచి నాగరాజు, మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంతి, జ్యోతి, వీరాపురం మాజీ ఎంపిపి పాలయ్య, 75వీరాపురం సర్పంచి నాగరాజు, గుమ్మగట్ట సర్పంచి విజయలక్ష్మి, మారంపల్లి సర్పంచి రామాంజనేయులు, మాజీ కౌన్సిలర్లు జ్యోతి, భారతి, పురుషోత్తం, సుమలత కేశవ రెడ్డి, పోట్ల రవి , ఎంపిటిసిలు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : నారా లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలంనరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. మండల పరిధిలోని పప్పూరు గ్రామం నుంచి ప్రారంభమైన యాత్ర గూగూడు వరకూ సాగింది. ఈ పాదయాత్రకు నియోజకవర్గవ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు రామలింగారెడ్డి, విశాలాక్షి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి నాగరాజు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, జిల్లా నాయకులు ఆలం వెంకటరమణ, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, ఆలం నాగర్జుననాయుడు, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేశ్వరనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రంలో కొనసాగుతున్న వైసిపి

అనంతపురం నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న ప్రభాకర్‌చౌదరి

రాయదుర్గంలో పాదయాత్ర నిర్వహిస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ఆరాచక పాలనకు చరమగీతం పాడి టిడిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి కలిసికట్టుగా పని చేద్దామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా నగరంలోని తపోవనం నుంచి నాగిరెడ్డిపల్లి వరకు పాదయాత్ర చేశారు. తపోవనం, నారాయణపురం, ఇందిరమ్మ కాలనీ మీదుగా పాదయాత్ర నాగిరెడ్డిపల్లెకు చేరుకుంది. దారిపొడవునా ప్రజలు నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనను సాగనంపాలన్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేశారని, ఒక్క ఛాన్స్ అన్ని ప్రజలు అవకాశం ఇస్తే అధిక పన్నులతో ప్రజల నడ్డి విరుస్తున్నారని తెలిపారు. అనంతరం నాగిరెడ్డిపల్లె ఆంజనేయస్వామి గుడిలో పూజలు నిర్వహించి పాదయాత్ర ముగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు జంబాపురం రమణారెడ్డి, సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, వీరాంజనేయులు, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, నగర అధ్యక్షుడు మారుతీ కుమార్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు డిష్ నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, నాయకులు కూచిహరి, రాయల్ రఘు, రాజారావు, సుధాకర్ యాదవ్, బొమ్మినేని శివ, ముక్తియార్, నబి రసూల్, బంగి నాగ, దలవాయి వెంకట నారాయణ,తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : నియోజకవర్గంలోని నార్పల మండలంలో చేపట్టిన సంఘీభావ యాత్రకు మండలం నుంచి తెలుగుతమ్ముళ్లు భారీ ఎత్తున తరలివెళ్లారు. పాదయాత్రలో మండలానికి చెందిన టిడిపి నాయకులు రవిచంద్రనాయుడు, తీర్థమయ్య, ఆదినారాయణరెడ్డి, రామాంజనేయులు, పెద్దయ్య, శ్రీనివాస్‌రెడ్డి, భక్తవత్సల నాయుడు, చంద్ర, ఓబన్న, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : నియోజకవర్గంలోని నార్పల మండలంలో చేపట్టిన సంఘీభావ పాదయాత్రకు మండలం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీ ఎత్తున తరలివెళ్లారు. టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు మారుతీనాయుడు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాసుల చంద్రమోహన్, తదితరులు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

కళ్యాణదుర్గం : నారా లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమా మహేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతురాయచౌదరి వేర్వేరుగా సంఘీభావ పాదయాత్రలు చేపట్టారు. ఉన్నం హనుమంతురాయచౌదరి ఆధ్వర్యంలో మండల పరిధిలోని పాపంపల్లి గ్రామం నుంచి కళ్యాణదుర్గం పట్టణంలోని సాయిబాబా ఆలయం వరకూ, ఉమామహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో శెట్టూరు మండలం యాటకల్లు రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి పట్టణంలోని గోదాదేవి సమేత వెంకటేశ్వస్వామి ఆలయం వరకు పాదయాత్రలు నిర్వహించారు.